క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా నిలవాలి

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ముఖ్యంగా సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా నిలవాలని, వారికి ఏ కష్టమొచ్చిని అందుబాటులో ఉండాలని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) మాజీ సీఎం జగన్‌ని గురువారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేసి, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆదేశించారని గోపి తెలిపారు.

రంగస్థల నటి రమణకు సత్కారం



మహంతి రమణను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పాలకొల్లు అర్బన్: రంగస్థల నటిగా వందలాది ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను అలరించిన మహంతి రమణ అభినందనీయురాలని మండల పరిషత్ ప్రతిపక్షనేత శాగ సత్యనారాయణ అన్నారు. మండలంలోని దగ్గులూరులో వీరభద్రస్వామివారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇటీవల విజయవాడలో మహానటి సావిత్రి అవార్డు అందుకున్న రమణను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు. చల్లా మల్లికార్జునరావు, సమతం మల్లేశ్వరరావు, సమతం నాగేశ్వరరావు, రంగస్థల నటులు తాళ్ల కోటి నరసింహ మూర్తింగం తదితరులు రమణను పూలమాలలతో సత్కరించి అభినందించారు.

డంపింగ్‌యార్డ్‌లో చెత్త సమస్యకు పరిష్కారం



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: గోదావరి గట్టున ఉన్న డంపింగ్ యార్డ్‌లో ఇకపై చెత్త సమస్య ఉండదని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. గురువారం కమిషనర్ డంపింగ్ యార్డ్ వద్ద ఏర్పాటు చేస్తున్న లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ మిషన్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెగసీ వేస్ట్ మేనేమెంట్ ద్వారా చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తామని వివరించారు. డంపింగ్‌యార్డ్‌ను వేరొక ప్రాంతానికి తరలించే ప్రయత్నం కూడా జరుగుతుందని చెప్పారు. అనంతరం కమిషనర్ 14వ వార్డులో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట కౌన్సిలర్ కొప్పాడ కృష్ణవేణి, డీఈ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పెనుగొండ: మండలంలోని మిద్దేవారి పాలెంలో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా మద్యం అమ్ముతూ బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న చిన్నమిల్లి వెంకటేశులు(53)ను అరెస్ట్ చేసినట్లు తణుకు ఎక్సైజు సీఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతోమాట్లాడుతూ నిర్వాహకుడు నుంచి ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీల ఎస్సై ఆర్.మధుబాబు, బి.లక్ష్మీ పాల్గొన్నారు.

సోమేశ్వరునికి ప్రత్యేక పూజలు



సోమేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని జుత్తిగ శ్రీసో మేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజ లు చేశారు. స్వామి వారికి కదలీ ఫలరసంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి భక్తులతో లక్షబిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గణేష్, వాసు, రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.

మోటారు సైకిల్ ఢీకొని ముగ్గురికి గాయాలు

భీమవరం: స్కూల్ నుంచి తన కుమారుడిని మోటారు సైకిల్‌పై తీసుకు వస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరొక మోటారు సైకిల్ ఢీకొనడంతో భార్య, భర్తలు, కుమారుడు గాయపడ్డారని భీమవరం టుటౌన్ ఎస్సై రెహమాన్ గురువారం చెప్పారు. పట్టణంలోని బలుసుమూడికి చెందిన జి.మోహన్ రవితేజ తన కుమారుడు ఇవాన్ పెదఅమిరంలోని ప్రైవేట్ స్కూల్లో చదువుతుండడంగా బుధవారం మధ్యాహ్నం స్కూల్ నుంచి ఇంటికి తీసుకు వచ్చేందుకు మోహన్‌రవితేజ అతని భార్య నమ్రత కృష్ణ మోటారు సైకిల్‌పై వెళ్లి ముగ్గురు తిరిగి వస్తుండగా చినఅమిరం గ్రామం వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి మరొక మోటారు సైకిల్‌పై గోనె సంచులతో వస్తున్న వ్యక్తి మోహన్‌రవితేజ మోటారుసైకిల్‌కు ఢీకొనడంతో ముగ్గురు గాయాలపాలయ్యారు. బాధితులు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రెహమాన్ చెప్పారు.

ఆక్రమణల చెరలో శివదేవునిచిక్కాల

- 16 డిపార్టమెంట్‌లకు ఫిర్యాదు చేసిన యువత
- యువకుల పట్టుదలతో దిగొచ్చిన అధికారులు



చిక్కాల ఎన్‌హెచ్ 165లో ఆక్రమణలు సర్వే చేస్తున్న అధికారులు



పంచాయతీ స్థలంలో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, లైబ్రరీలు

పాలకొల్లు సెంట్రల్: శివదేవుని చిక్కాల గ్రామం అంటే ఓ విశిష్టత ఉంది. ఇక్కడ ఉన్న శివాలయంలో శివరాత్రి నాడు స్వామి వారిని దర్శించుకుని కొబ్బరి మొక్క నాటితే పిల్లలు పుడతారని ప్రతీతి. ఈ గ్రామంలో సుమారు 4 వేల మంది వరకూ జనాభా ఉన్నారు. ఇటువంటి విశిష్టత కలిగిన ఈ శివయ్య సన్నిధిలో కొందరు వ్యక్తులు పెద్దల్లా చలామణి అవుతూ గ్రామస్థులను పెద్దమనుషుల్లా నమ్మిస్తూ ఆ గ్రామంలో ఆదాయ వనరులను వారి ఇష్టానుసారంగా పంచేసుకున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అదే మా పార్టీ అంటూ ఉన్నతాధికారులు, పొలిటికల్ లీడర్లు వస్తే వారి ఇళ్లల్లోనే విందు ఏర్పాటు చేస్తారు. గ్రామంలో కొందరు వ్యక్తులు దాదాపు 2.90 ఎకరాల చెరువును సుమారు 70 ఏళ్లుగా వారి సొంత ఆస్థిలా పంచేసుకున్నారు. అప్పట్లో ఎవరైనా గ్రామస్తులు ఆ చెరువు గట్టు నుండి నడిచి వెళ్లాలన్నా వెళ్లనిచ్చే వారు కాదు. అప్పట్లో గ్రామస్తులు అదంతా వారి సొంత ఆస్థి అనుకునేవారు.

యువకుల కృషి

ఆ గ్రామంలో సుబ్బరాజు అనే ఓ పెద్దాయన జరుగుతున్న ఆక్రమణలపై కదంతొక్కాడు. ఆ గ్రామంలో కొందరు యువకులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన చొరవతో కొందరు పెద్దలు, యువకులు తమ గ్రామం రక్షణ కోసం 2007 నుండి పోరాటం మొదలు పెట్టారు. వారి పోరాట ఫలితంతో 2013లో ఆక్రమణకు గురైన 2.90 ఎకరాల చెరువు, భూమిలో ఆక్రమణలు పోగా మిగిలిన చెరువు, స్థలాన్ని పంచాయతీ స్వాధీనం చేసుకుంది. అలా స్వాధీనం చేసుకున్న స్థలంలోనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, లైబ్రరీ భవనాలు నిర్మించారు. చెరువు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి నేటికి మూడు పర్యాయాలు పంచాయతీ పాట పెట్టగా ఒక్కో పర్యాయానికి ఆ గ్రామానికి సుమారు రూ 5 లక్షల వరకూ ఆదాయం వస్తుంది. అలాగే చెరువు గట్టున ఉన్న కొబ్బరి చెట్ల పాటకు సుమారు రూ. 60 వేలు ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం చూసిన ఆ యువకులు ఆక్రమించుకున్న వ్యక్తులచే ఈ 70 ఏళ్లలో ఎంత ఫలసాయం పొందారో దానిని పంచాయతీకి కట్టించాలని పట్టుపడుతున్నారు. అయితే కేవలం చెరువ మాత్రమే కాదని గ్రామంలో చాలా ప్రాంతాలు ఆక్రమణల్లోనే ఉన్నాయని యువకులు చెబుతున్నారు.

ఆక్రమణలకు గురైన ప్రదేశాలు...

గ్రామంలో రెండవ వార్డులో రాపాక కాలువ నుండి తిల్లపూడి రోడ్డు దాటి బూరుగు కోడులోకి వెళ్లి ముదుగుబోది, రాజులు చెరువు వెనుక భాగం నుండి వెళ్లే మురుగు బోది ఆక్రమించుకోవడంతో గ్రామంలో 2, 9, 10 వార్డులు చిన్నపాటి వర్షానికే నీట మునిగిపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. భీమవరం పాలకొల్లు నేషనల్ హైవే 165 రోడ్డులో సర్వే నెం 131-3, 131-4లో 21 సెంట్లు భూమిని పంచాయతీ స్వాధీనం చేసుకుంటే ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్, బస్టాండ్ నిర్మిస్తే పంచాయతీకి ఆదాయం, ప్రజలకు ఉపయోగంగాను ఉంటుంది. ఎన్‌హెచ్ 165 సమీపంలో లే అవుట్ చేయగా సర్వే నెంబర్ 126లో పంచాయతీ చెరువుకు చెందిన మురుగు బోదెని ఆక్రమించి ప్లాట్లు విక్రయించారు. సర్వే నెంబర్ 119-1లో ఉన్న మంచినీటి చెరువు ఒకప్పుడు ప్రజల దాహార్తిని తీర్చేది. ప్రస్తుతం ఈ చెరువుకు సంబంధించిన ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ఆక్రమణలకు గురికావడంతో చెరువు మంచినీళ్లకు ఉపయోగం లేకుండా పోయింది. అలాగే 111-1 సర్వే నెంబర్ శివాలయం వెనుక ఉన్న చెరువు 10.12 ఎకరాలు విస్తీర్ణంలో ఉంది. దీనికి ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో ఆక్రమణలకు గురికావడంతో గ్రామానికే ఉపయోగపడే తాగునీటి చెరువు అధ్వానంగా తయారైంది. అంతే కాకుండా ఈ చెరువును పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల చేపల చెరువులు తవ్వడంతో ఈ చెరువులో నీరు కలుషితమైపోయింది. 109-1 సర్వే నెంబర్లో ఉన్న 3.40 ఎకరాల పశువుల చెరువు గట్లు ఆక్రమణలకు గురిచేసి కొబ్బరి చెట్లు నాటుకున్నారు. ఇలా ఆక్రమణలకు గురైన స్థలాలను పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకుని పంచాయతీకి ఆదాయం పెంచి గ్రామ అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ఎన్నో బెదిరింపులకు దిగారు



గ్రామంలో గత 70 ఏళ్లుగా ఆక్రమణలో ఉన్న చెరువును పంచాయతీకి అప్పగించే వరకూ మేము చేసిన పోరాటంలో ఎన్నో బెదిరింపులు వచ్చాయి. కేసులు పెట్టించుకున్నాము. మాపై దాడులకు కూడా వెనుకాడలేదు. ఇంకా ఆక్రమణలు ఉన్నాయి. అవి కూడా అధికారులు అప్పగించుకోవాలి. ఇంత అన్యాయం జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణలో ఉన్న స్థలాలన్నీ పంచాయతీ స్వాధీనం చేసుకుంటేనే మా పోరాటం ఆగుతుంది.

– దాట్ల సుబ్బరాజు, ఎస్.చిక్కాల

గ్రామాభివృద్ధికే పోరాటం



16 డిపార్ట్‌మెంట్‌లకు ఫిర్యాదులు చేస్తే నేటికి అధికారుల బృందం స్పందించి సర్వేకు వచ్చింది. ఈ సర్వే వల్ల మాకు సొంత లబ్ధి ఏమిలేదు. ఆక్రమణలో ఉన్నది మా సొంత మనుషులైనా సరే బయటి వారైనా సరే ఒకటే నిబంధన పాటించమని అధికారులకు చెబుతున్నాం. ఒంటరిగా తిరక్కండి మీపై దాడి చేస్తారని బెదిరింపులు కూడా వచ్చాయి. గ్రామ అభివృద్ధి కోసం మా పోరాటం ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధమే.

– కోటిపల్లి శ్రీనివాస్, ఎస్.చిక్కాల

ఘనంగా ప్రపంచ టెలివిజన్ దినోత్సవం



టెలివిజన్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న టీవీ మెకానిక్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పేదలను ఆదుకోవడంలో ఎంతో ఆనందం ఉంటుందని టీవీ మెకానిక్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలో ప్రపంచ టెలివిజన్ డే సందర్భంగా పేదలకు రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ టెలివిజన్ కనుక్కున్న ఘనత జాన్ లోగీ బెయిర్డ్, చార్లెస్ ప్రాన్సిస్‌లదని అన్నారు. ఐక్యరాజ్యసమితి 1996 నవంబర్ 21 టెలివిజన్ డే గా ప్రకటించడంతో నాటి నుండి ఈ రోజును ప్రపంచ టెలివిజన్ డేగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, సెక్రటరీ నల్లా శివకుమార్, ట్రెజరర్ జమితార శేఖర్, గుబ్బల శ్రీను, శ్రీదర్ రెడ్డి, వట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నరసాపురం రూరల్: రానున్న రెండు రోజుల్లో తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతాంగం అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఈదా అనిలకుమారి సూచించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతులు కోసిన పంటను చేలల్లో విడచి పెట్టకుండా వెంటనే ఒబ్బిడి చేసుకోవాలన్నారు. వీలైతే తుఫాన్ అనంతరం వరికోత పనులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని, రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలను పాటించాలని కోరారు.

ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనం



వెలగలవారిపాలెంలో రూ. 50 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం



వెలగలవారిపాలెంలో 2000 సంవత్సరంలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం

పెనుమంట్ర: మండలంలోని వెలగలవారిపాలెం గ్రామంలో సుమారు రూ. 50 లక్షల వ్యయంతో నూతన సచివాలయ భవనం నిర్మించినప్పటికీ సచివాలయ కార్యకలాపాలు పాత భవనంలోనే ఇరుకు గదుల్లోనే నిర్వహిస్తున్నారు. వెలగలవారిపాలెం గ్రామ పంచాయతీ 1983లో పెనుమంట్ర పంచాయతీనుంచి విడదీసి ప్రత్యేక పంచాయతీగా గుర్తించారు. అప్పటి నుంచే 16 ఏళ్లకు పైగా అద్దె భవనంలో నిర్వహించిన ఈ గ్రామ పంచాయతీ 2000లో నూతన భవనం సమకూరింది. అప్పటి నుంచి ఆ భవనంలోనే పంచాయతీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ భవనం పంచాయతీ కార్యకలాపాలకు చాలీచాలని గదులతో ఉండటంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో రూ. 43.60 లక్షలతో ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో గ్రామానికి మధ్యలో మెయిన్‌రోడ్డు పక్కన మూడేళ్ల క్రితం నూతన సచివాలయ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ భవన నిర్మాణ పనులు ఎన్నికల ముందే పూర్తయినప్పటికీ ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నేటికి ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులను వివరణ కోరగా నిర్మాణ పనుల్లో జాప్యం జరగడంతో ఎస్టిమేట్ వేల్యూ పెరగడంతో కార్యాలయంలో ప్లంబింగ్, ఎలక్ట్రికల్, పెయింటింగ్ పనులు పూర్తి కాలేదని ఈ పనుల నిమిత్తం మరో రూ. 6 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తున్నామని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో భవనాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలను అణగదొక్కే కుట్ర



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మాలల న్యాయపోరాట సమితి నాయకులు

నరసాపురం: మాలలను ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా అణగదొక్కే కుట్రను రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని మాలల న్యాయ పోరాట సమితి కన్వీనర్ సోడదాసి శ్రీదర్ అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ముందడుగు వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌ను నియమించడాన్ని నిరసిస్తూ గురువారం మాలల న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ మాలలకు రిజర్వేషన్ ఫలాలు దక్కకూడదనే ఉద్దేశంతో ఎస్సీ వర్గీకరణ చేస్తున్నారని అన్నారు. మన రాష్ట్రంలో వర్గీకరణ వేగంగా అమల్లో పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తాపత్రయపడుతున్నారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు రద్దు చేయాలని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతందని పేర్కొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ దొండపాటి స్వాములు, అడిదల శరత్ మాట్లాడుతూ ఓ పక్క ఈబీసీ రిజర్వేషన్ అమలుతోనే మాలలు దారుణంగా నష్టపోతున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణజరిగితే మాలలు రిజర్వేషన్‌లు కోల్పోతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘనాయకులు ఎంపీపీ మైలా బత్తుల సోనీ, వర్దనపు ఏసురత్నం, జిల్లెళ్ల దిలీప్, గోరింకల దీనమనస్సు, గోరింకత వినోద్, నల్లి రాజేష్, మైలాబత్తుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పశుగణన సర్వే



పశుగణన సర్వే చేస్తున్న పశు వైద్య సహాయకులు (ఫైల్)

యలమంచిలి: ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే పశుగణన సర్వే ఈ ఏడాది నవంబర్ ఒకటి నుంచి పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రారంభించారు. గ్రామాలు, పట్టణాలలో పశుసంవర్ధక శాఖ సహాయకులు, సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి మూగ జీవాల లెక్కలు పక్కాగా నమోదు చేస్తున్నారు. ఆవులు, గేదెలు, మేకలు, పందులు, కుక్కలు, కోళ్ల, ఇతర పక్షుల సంఖ్యను లెక్కించి రికార్డులో నమోదు చేస్తున్నారు. ఏ ఇంట్లో ఏయే రకాల మూగ జీవాలు ఉన్నాయి? గతంలో కంటే పాడి పరిశ్రమ ఎక్కువగా ఉందా? అనే అంశాలను తెలుసుకునేందుకు సర్వే ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే ఈ ప్రక్రియ గతంలో 2018 ప్రారంభమై 2019లో ముగిసింది. మళ్లీ 2024లో ప్రారంభించారు. 2025 ఫిబ్రవరి వరకూ ఈ సర్వే జరుగుతుంది.

2019 సర్వే ప్రకారం..

2019లో జరిగిన సర్వే ప్రకారం పాలకొల్లు నియోజకవర్గంలోని పాలకొల్లు పట్టణం, మండలం, యలమంచిలి మండలాల్లో ఆవులు 8007, గేదెలు 14,033, గొర్రెలు 3900, మేకలు 2586, పందులు 85, కుక్కలు 2583, కోళ్ల 62,870, బాతులు 267 ఉన్నట్లు తేలింది. గతంలో సిబ్బంది కొరత వల్ల సర్వే పాక్షికంగా జరిగింది. అయితే ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా సిబ్బంది అందుబాటులో ఉండడంతో ఈ సర్వే పక్కాగా చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

పారదర్శకంగా పశుగణన సర్వే



మూగజీవాల లెక్కింపు ప్రతి ఐదేళ్లకోసారి జరుగుతుంది. ఈ ఏడాది నవంబర్ 1వ సర్వే ప్రారంభించాం. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి మూగ జీవాల సంఖ్య పక్కాగా నమోదు చేస్తున్నారు. ఎన్ని జంతువులు ఉన్నాయి? పాడి పరిశ్రమ ఎలా ఉంది? కోళ్ల ఉత్పత్తి తదితర వివరాలు రికార్డులో నమోదు చేస్తున్నారు.

– డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మండల పశు వైద్యాధికారి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న తహసీల్దార్ దుర్గా కిషోర్

పాలకొల్లు సెంట్రల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని ఎంత ఉపయోగించుకుంటే మన మేధస్సు అంత పెరుగుతుందని తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ శాఖా గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దుర్గా కిషోర్ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారిణి శాంతకుమారి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా గ్రంథాలయానికి సొంత భవనం లేక అద్దె భవనాల్లోనే కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం ఎక్కడైనా స్థలం ఏర్పాటుచేసి గ్రంథాలయ భవనం నిర్మాణం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పాలకొల్లుకు చెందిన కవయిత్రి, సినీ గేయ రచయిత్రి పప్పాప్పు విజయలక్ష్మి (కె. భాగ్యలక్ష్మి)ని సత్కరించారు. కవులు చేగొండి రంగారావు, కొలాటి పెద్దిరాజు, కొల్లాబత్తుల సూర్యకుమార్, వై.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొండాడకు ఘన నివాళి



రాధారమణ గుప్త చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రసధుని సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో రసధుని సాహితీ సంస్థ ఏర్పాటుకు కృషి చేసిన దాత బొండాడ వెంకట రాధారమణ గుప్త మృతి సంస్థకు తీరనిలోటని సంస్థ అధ్యక్షులు కొట్టి భాస్కరరావు అన్నారు. గురువారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో రాధారమణ గుప్త చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ 1994లో రసధుని సంస్థ ఏర్పాటుకు కృషి చేయడంతో పాటు ఆర్థిక సహకారం అందించారన్నారు. సంస్థకు పూర్వ అధ్యక్షుడిగా ఎంతో సేవ చేశారన్నారు. ఆయన స్ఫూర్తితోనే గత 30 ఏళ్లుగా రసధుని సాహితీ సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యర్రంశెట్టి వెంకటరత్నం, సీవీవీ సత్యనారాయణ మూర్తి, పేరిచర్ల సత్యప్రతాప్ రాజు, వీవీ తిరుపతి రాజు, కోలాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు కార్మికులకు ఉపాధి కల్పించాలి



పెనుగొండ తహసీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుగొండ: రెండు రోజులుగా నడిపూడిలో యంత్రాలతో ఇసుకను తవ్వేస్తున్నారని, ఇసుక తవ్వకాల ద్వారా కార్మికులకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ నాయకులు షేక్ పాదుషా డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దారు జి.అనిత కుమారికి వినతిపత్రం సమర్పించారు. సుబ్రహ్మణ్యేశ్వర ఇసుక జట్టు కార్మిక సంఘంలో సుమారు 300 మంది కార్మికులు ఉన్నారన్నారు. వీరంతా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో ఉపాధి పనులపై చర్చించారని, ఉపాధికి హామీ ఇచ్చారన్నారు. అయితే స్థానిక నాయకులు ఉపాధి కల్పించడంలో అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక జట్టు కార్మికులకు ఉపాధి కల్పించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాదాసు నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యేశ్వర ఇసుక కార్మికుల సొసైటీ అధ్యక్షుడు రేలంగి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు జీవన ప్రమాణాలు పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం: మత్స్యకారులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, జీవన ప్రమాణాలు పెంచుకోవాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీఓ మాట్లాడుతూ మత్స్యకారుల వృత్తి ఎంతో సాహసంతో కూడుకున్నదన్నారు. ఎంతో కష్టసాధ్యమైన వేట ద్వారా సముద్ర ఉత్పత్తులను తీసుకువస్తారని చెప్పారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మత్స్యకారులు సముద్రంలో వేట సాగించే క్రమంలో మత్స్యసంపద నశించిపోకుండా చూడాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘాల ఉత్తమ అధ్యక్షులుగా తిరుమాని మహాలక్ష్మి, బేరం శ్రీరామచంద్రమూర్తిలను ఎంపిక చేసి సత్కరించారు.

అపార్ నమోదు వేగవంతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): అపార్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని అందరూ మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వార్డు అడ్మిన్ సెక్రటరీలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలు, ప్రైవేట్ పాఠశాలలు అపార్ ప్రక్రియను నమోదును నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదు ప్రక్రియ వెనుకబడి ఉన్న వారిపై చర్యలు తీసుకుంటమాని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, బ్యాంకు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయం అధికారి వై.దోసి రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఏ.నాగేంద్ర ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి వి.అరుణ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ అవకతవకలపై విచారణ చేయాలి

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధుల్లో ఉన్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ సొమ్ము అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో గురువారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి తమ నిరసన తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణకు వినతి పత్రం అందించారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప మాలధారులు



శబరిమల యాత్రకు వెళ్తున్న మాలధారులు

యలమంచిలి: మండలంలోని యలమంచిలిలంక గ్రామంలో గురుస్వామి బేతినీడి రామకృష్ణ ఆధ్వర్యంలో అయ్యప్పమాల ధరించిన 60 మంది స్వాములు మండల దీక్ష ముగించుకుని శబరిమల బయలుదేరారు. స్థానిక రామాలయం వద్ద అయ్యప్ప స్వాముల ఇరుముడుల కార్యక్రమం గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా మండల దీక్ష ముగించుకున్న స్వాములంతా బుధవారం రంగులు చల్లుకుంటూ గ్రామంలో పేట తుళ్లి ఆడారు. ఇరుముడుల అనంతరం స్వాములకు, వారి బంధువులు సుమారు 800 మందికి భిక్ష ఏర్పాటుచేశారు. శబరిమల వెళ్లిన వారిలో గురుస్వాముల కొడవటి పెదకాపు, నెక్కంటి రాజా ఉన్నారు.

నేడు మార్టేరులో..

పెనుమంట్ర: మార్టేరు గ్రామంలో ఉన్న శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అయ్యప్పస్వామి సేవా పీఠం ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప స్వామికి డ్రై ఫ్రూట్స్‌తో అభిషేకాలు నిర్వహించారు. విజయదశమి రోజున మాలధారణ చేసి 41 రోజుల పాటు దీక్షాధారణ చేసిన 30 మంది అయ్యప్ప మాలాధారులు శుక్రవారం ఇరుముడి ధరించి శబరిమలై యాత్రకు బయలుదేరతారని గురుస్వాములు అడబాల శ్రీనివాస్, మల్లిడి రామకృష్ణారెడ్డి తదితరులు గురువారం విలేకరులకు తెలిపారు.